క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: సామాజిక న్యాయ సాధనలో భాగంగా అర్హులైన ప్రతీ కుటుంబానికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బుధవారం బడంగ్‌పేట మున్సిపల్ పరిధిలో 127 మంది అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రేవంత్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ సరిగా అమలు చేయడం లేదని విమర్శించారు. ఇచ్చిన హామీలు నెరవేరేవరకు ప్రజల పక్షాన పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలాపూర్ మండల తహసీల్దార్ ఇందిరాదేవి, కమిషనర్ సరస్వతి, మాజీ కార్పొరేటర్లు ఏనుగు రాంరెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, బోద్రమోని రోహిణి రమేశ్, నాయకులు పి.ఆనంద్‌రెడ్డి, భీమిడి జంగారెడ్డి, బోయపల్లి శేఖర్‌రెడ్డి, బ్యాంక్ చైర్మన్ నర్సింహారెడ్డి, ముత్యాల కృష్ణ, లబ్ధిదారుల కుటుంబాలు, నాయకులు పాల్గొన్నారు.

నేడు పంజగూడ, గుమ్మడవెల్లిలో గ్రామసభలు

కందుకూరు: ఫ్యూచర్ సిటీలోకి నేరుగా చేరుకునేలా ప్రభుత్వం నిర్మించనున్న 330 అడుగుల రహదారికి సంబంధించి భూములు కోల్పోతున్న గ్రామాల్లో అధికారులు వరుసగా గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం కందుకూరు మండలం పంజగూడలో ఉదయం 11 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు గుమ్మడవెల్లిలో అధికారులు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

బాలాపూర్ చౌరస్తాలో మాక్ డ్రిల్



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ నాగరాజు

మీర్‌పేట: మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి బాలాపూర్ చౌరస్తాలో బుధవారం మీర్‌పేట పోలీసులు, ట్రాఫిక్, బాలాపూర్ రెవెన్యూ అధికారులు సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా దేశమంతా యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితిలో సాధారణ పౌరులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యుద్ధ పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇందిరాదేవి, మీర్‌పేట కమిషనర్ జ్ఞానేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సబితారెడ్డికి క్లీన్ చిట్ రావడం హర్షణీయం



సబితారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ అఫ్జల్

పహాడీషరీఫ్: ఓబులాపురం మైనింగ్ కేసులో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నిర్దోషి అంటూ న్యాయస్థానం తీర్పు వెలువరచడం సంతోషకరమని మున్సిపాలిటీ ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ అఫ్జల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి సంతోషాన్ని పంచుకున్నారు. నీతి, నిజాయితీకి మారుపేరుగా ఉంటూ దశాబ్దాలుగా పట్లోళ్ల కుటుంబం ప్రజాసేవలో కొనసాగుతుందన్నారు. సబితారెడ్డిపై నమోదైన కేసు విషయమై ప్రతిపక్షాలు పదే పదే ప్రస్తావిస్తూ రాజకీయ లబ్ధిపొందే ప్రయత్నం చేశాయన్నారు. కానీ చివరకు న్యాయమే గెలవడంతో కార్యకర్తలకు బలం వచ్చినట్లయ్యిందన్నారు.

రహదారిపై హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

షాద్‌నగర్: పట్టణంలో పాత రహదారిపై హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలోని చౌరస్తా నుంచి సోలీపూర్ వైజంక్షన్ వరకు ఇటీవల రోడ్డు విస్తరణ పనులు చేపట్టి పూర్తిచేశారు. ఇందులో భాగంగానే రోడ్డు మధ్యలో లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో త్వరలో పాత జాతీయ రహదారి విద్యుత్ వెలుగులతో నిండిపోనుంది.

దారులు అధ్వానం.. ప్రయాణం నరకం

గుంతలమయమైన ఆర్‌సీఐ రహదారి

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



అధ్వానంగా మారిన బాలాపూర్ ఆర్‌సీఐ రోడ్డు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. ఎక్కడ చూసిన పెద్ద గుంతలుగా మారి బాటసారులు, వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ మరింత ప్రమాదకరంగా మారాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజల అవస్థలు తీవ్రమయ్యాయి. బడంగ్‌పేట నుంచి బాలాపూర్ వెళ్లే ఆర్‌సీఐ ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ఒక వాహనం వస్తే రెండో వాహనం ఆగాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో వాహనాలు, బైకులు సైతం సులువుగా వెళ్లలేని దుస్థితి దాపురించింది.

రాకపోకలకు అవస్థలు

బడంగ్‌పేట క్రాస్ రోడ్డు నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకు ప్రమాదకరంగా మారింది. బచ్‌పన్ స్కూల్ నుంచి బాలాపూర్‌లోని ఆర్‌సీఐ(కట్టెల మిషన్) వరకు రోడ్లు చెదిరిపోయింది. అలాగే అల్మాస్‌గూడ కమాన్ వద్ద న్యూ బాలాజీనగర్ కాలనీ వరకు, సిరిపురం యాదయ్య క్రికెట్ స్టేడియం మూల మలుపు వద్ద బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ వెళ్లే ప్రధాన రహదారి వద్ద మధ్యలో పెద్ద గుంత ఏర్పడి వాహన చోదకులు ప్రమాదానికి గురవుతున్నారు. నాదర్‌గుల్ నుంచి ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ వరకు భారీ గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

త్వరలో బాగు చేస్తాం



ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు రోడ్లు గుంతలు ఏర్పడిన విషయం తెలిసింది. బీటీ రోడ్లు వేసేందుకు ప్రతిపాదనలు పై అధికారులకు పంపాం. కొన్ని చోట్ల ప్యాచ్ వర్కులు వేసేందుకు రోడ్లను చెక్ చేశాం. వారం రోజుల్లో పనులు మొదలు పెడుతాం. బాలాపూర్ ఆర్‌సీఐ రోడ్డుకు త్వరలో మరమ్మతులు చేసి వాహనాలు సులువుగా వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.

– వెంకన్న, డిప్యూటీ డీఈఈ, బడంగ్‌పేట్ కార్పొరేషన్

సమ్మె నోటీస్ అందజేత



ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి సమ్మె నోటీస్ అందిస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

కందుకూరు: ఈ నెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నామని తెలుపుతూ మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. నెలకు రూ.26వేలు మధ్యాహ్న భోజన కార్మికులకు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.3వేలతోనే సరిపెడుతున్నారని ఆరోపించారు. విద్యార్థులకు పాఠశాలల్లో అప్పులు చేసి వంటలు చేయాల్సి వస్తుందని, సకాలంలో బిల్లులు ఇవ్వడం లేదన్నారు. కార్మికుల హక్కులు కాపాడుకునేలా సమ్మెలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు ప్రభావతి, కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు గీత, బాలమణి, ప్రేమలత, సంధ్య, అండాలు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పాకిస్తాన్ జెండా దహనం

హుడాకాంప్లెక్స్: పాకిస్తాన్ చేసిన ఉగ్రదాడికి ప్రతి చర్యగా భారత త్రివిధ దళాల సైన్యం చేసిన ఆపరేషన్ సింధూర్‌పై గర్వపడుతూ సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఆధ్వర్యంలో బుధవారం సైనికులకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ జెండాకు చెప్పుల మాల వేసి తగులబెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇకపై ఉగ్రవాదులకు, దేశ ద్రోహులకు మన దేశంలో స్థానం లేదని, వారిని సహించేది లేదన్నారు.

కొర్వి బాలకృష్ణముదిరాజ్‌కు పీహెచ్‌డీ పట్టా



ప్రొఫెసర్లతో అవార్డు అందుకున్న బాలకృష్ణముదిరాజ్

కందుకూరు: మండల పరిధిలోని గూడూరుకు చెందిన ఓయూ జేఏసీ నాయకుడు కొర్వి బాలకృష్ణముదిరాజ్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఇంగ్లిష్ విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కొండా నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్‌కు సంబంధించి తెలంగాణలో ప్రొఫెషనల్ కోర్సుల్లో చదువుతున్న విద్యార్థుల్లో సాఫ్ట్ స్కిల్స్ సాహిత్యం ద్వారా ఎలా అభివృద్ధి చేయొచ్చు అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. ఈ పరిశోధనలో విద్యార్థుల్లో కమ్యూనికేషన్స్, లీడర్ షిప్, టీం వర్క్, ఎమోషన్ అర్థం చేసుకోవడం వంటి నైపుణ్యాలు, సాహిత్యం ద్వారా ఎలా అభివృద్ధి అవుతాయో తన థీసెస్ ద్వారా తెలిపారు. ఈమేరకు ఆయనకు బుధవారం ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్లు పీహెచ్‌డీ అవార్డును అందజేసి అభినందనలు తెలిపారు. కాగా తనకు సహకరించిన ప్రొఫెసర్ డాక్టర్ కొండా నాగేశ్వరరావుతో పాటు ప్రొఫెసర్లు విజయ, పరిమళకులకర్ణి, సి.మురళీకృష్ణ, వైఎల్ శ్రీనివాస్, అసోసియేట్ ప్రొఫెసర్లు క్రిస్టోఫర్, జె.మాధవి, మెలిసాహెలెన్‌కు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం



మహేశ్వరం: స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న విశ్వకర్మలు



కందుకూరు: ఆకులమైలారంలో హోమం చేస్తున్న భక్తులు

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 332 ఆరాధన మహోత్సవం(జీవ సమాధి అయిన రోజు) బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సృష్టిలో జరిగే పరిణామాలన్నింటినీ తన దివ్య దృష్టితో ముందుగానే చెప్పిన గొప్ప సంఘ సంస్కర్త వీరబ్రహ్మేంద్రస్వామి అని విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు వడ్ల కుమార్‌చారి పేర్కొన్నారు. అనంతరం విశ్వకర్మలు స్వామివారికి అభిషేకం, హోమం, పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌చారి, ప్రధాన కార్యదర్శి, పసునూరి వెంకటేశ్‌చారి, కార్యదర్శి వడ్ల ఆంజనేయులుచారి, కోశాధి కారి శేఖర్‌చారి, సలహాదారులు బాలచారి, నారాయణ చారి, ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు పసునూరి కనకచారి, ఉపాధ్యాక్షుడు కమ్మరి మహేశ్, ప్రధాన కార్యదర్శి వడ్ల మల్లేశ్‌చారి, కోశాధికారి రాజ్‌కుమార్, సలహాదారులు వెంకటాచారి పాల్గొన్నారు.

మీర్‌పేట చందన చెరువు కట్టపై..

మీర్‌పేట: శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం బుధవారం మీర్‌పేట చందన చెరువు కట్టపై ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారిలు పాల్గొని స్వామి విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకం, అలంకరణ, గణపతిపూజ, సామూహిక పూజలు, యజ్ఞం, మహానైవేద్యం సమర్పణ, మహాప్రసాద కార్యక్రమాలను సంఘం సభ్యులు నిర్వహించారు. కార్యక్రమంలో వీర బ్రహ్మంగారి కమిటీ చైర్మన్, మీర్‌పేట బీజేపీ అధ్యక్షులు పసునూరి భిక్షపతిచారి, నరేందర్‌చారి, రాగిఫణి అశోక్‌చారి, రాపల్లి కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆరాధన మహోత్సవానికి విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లాల్‌కోట వెంకటాచారి, అధ్యక్షుడు మదన్‌మోహన్‌చారి హాజరై స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆకులమైలారంలో..

కందుకూరు: మండల పరిధిలోని ఆకులమైలారంలో విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మంగారి విగ్రహానికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేసి హోమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు.



మీర్‌పేట: ఉత్సవాల్లో పాల్గొన్న విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లాల్‌కోట వెంకటాచారి, సంఘం సభ్యులు



మీర్‌పేట: ఉత్సవాల్లో పాల్గొన్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి, భిక్షపతిచారి

అక్రమ వలసదారులను తరిమేయాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

- బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సురేష్

హుడాకాంప్లెక్స్: రాష్ట్రంలో ఉన్న అక్రమ వలసదారులను గుర్తించి తక్షణమే వారి దేశాలకు తరిమేయాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బెంగర బోయిన సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆరుట్ల సురేష్ డిమాండ్ చేశారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధి భగత్‌సింగ్‌నగర్‌లో బంగ్లాదేశ్ అక్రమ వలసదారులను గుర్తించాలని బుధవారం సరూర్‌నగర్ మండల తహసీల్దార్ వేణుగోపాల్‌కు స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం దేశంలో యుద్ధ వాతావరణం నెలకొందని, అంతర్గత భద్రతకు ముప్పు రాకుండా ముందస్తుగా అక్రమ వలసదారులను గుర్తించి వెంటనే పంపించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 200 మందికి పైగా వలసదారులను గుర్తించి పంపినప్పటికీ భగత్‌సింగ్‌నగర్‌లో బంగ్లాదేశీయులు ఉన్నట్లు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం సరూర్‌నగర్ ఏసీపీ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు.

వైభవంగా వాసవిమాత జయంత్యుత్సవం



వాసవి మాత విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట జిల్లెలగూడలో నూతనంగా నిర్మిస్తున్న వాసవి కన్యకాపరమేశ్వరి మాత ఆలయంలో బుధవారం వాసవి మాత జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. వేడుకకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వాసవిమాత విగ్రహానికి క్షీరాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. సమాజసేవలో విశేషంగా నిలిచిన వాసవిమాత జీవితం అందరికీ ఆదర్శమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. అనంతరం ఆర్యవైశ్యులకు జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ ఆవరణలో మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ తెరేటిపల్లి శ్రీనివాస్ గుప్తా, సంఘం మీర్‌పేట అధ్యక్షుడు శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శి ఇరువెంటి సురేష్, కోశాధికారి వేంకటేశ్వర్లు, బాలాపూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'లోటస్ ల్యాప్' విద్యార్థులకు సన్మానం



శ్రీజరెడ్డిని అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

హుడాకాంప్లెక్స్: పదో తరగతి ఫలితాల్లో లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ సరూర్‌నగర్ బ్రాంచి కొన్నేళ్లుగా సత్తా చాటుతోందని ఫౌండర్, చైర్మన్ కడారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను బుధవారం సన్మానించారు. శ్రీజరెడ్డి 594 మార్కులతో రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచిందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ కడారి మాధవి మాట్లాడుతూ.. తమ పాఠశాలలో ఉన్నత విలువలతో కూడిన బోధన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పద్మజారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆమోదం సరే.. పరిష్కారమెప్పుడో?

కొందుర్గులో రెవెన్యూ అధికారుల పర్యటన

- భూ సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ
- ఆమోదించి వదిలేస్తున్న వైనం
- అయోమయంలో రైతన్నలు

రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు ఇలా..

తేదీ	గ్రామం	వచ్చిన దరఖాస్తులు	ఆమోదం	తిరస్కరణ
5	మహదేవ్‌పూర్	10	8	2
	రేగడిచిల్కమర్రి	36	11	25
6	శ్రీరంగాపూర్	19	18	1
	ఉత్తరాసిపల్లి	13	11	2
7	తంగెళ్లపల్లి	15	15	-
	ముట్పూర్	13	12	1



తంగెళ్లపల్లి రెవెన్యూ సదస్సులో రైతులతో వివరాలు తీసుకుంటున్న అధికారులు

కొందుర్గు: ధరణి పోర్టల్‌లో వివిధ కారణాలతో రైతుల భూ సంబంధిత వివరాల్లో తప్పులు దొర్లాయని, వాటిని సరిచేసి భూభారతి చట్టాన్ని అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. ఈ చట్టం 2025 జనవరి 4న రూపకల్పన చేశారు. ఏప్రిల్ 14న అమలులోకి తీసుకొచ్చారు. అయితే రాష్ట్రంలో జూన్ 2 నుంచి పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందుకోసం ప్రతీ గ్రామంలో సదస్సులు నిర్వహించి రైతుల ద్వారా భూ సమస్యలపై ఫిర్యాదులు సేకరించాలని నిర్ణయించింది. మొదటగా పైలట్ ప్రాజెక్టు క్రింద కొందుర్గు మండలాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 5 నుంచి మండలంలో రెవెన్యూ అధికారులు రెండు టీమ్‌లుగా గ్రామాల్లో పర్యటించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కానీ వాటికి పరిష్కారమెప్పుడోనని రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. అన్నదాతలు అందించిన అర్జీలను అధికారులు పరిశీలించి వాటిని ఆమోదిస్తున్నారే తప్పా పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తక్షణమే పరిష్కరించాలి



భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం సంతోషకరమైన విషయమే. కానీ సమస్యలపై రైతులు ఇచ్చిన దరఖాస్తులను అధికారులు తీసుకోవడమే తప్పా పరిష్కరం చేయకపోవడం బాధాకరం. వచ్చిన అర్జీలను అక్కడే విచారణ జరిపి పరిష్కరించి, రైతులకు ప్రొసీడింగ్‌లు అందజేయాలి. వెంటనే ఆన్‌లైన్‌లో సరిచేయాలి.

–బుద్దుల జంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

దరఖాస్తులపై విచారణ జరుపుతున్నాం



సదస్సులో రైతులు ఇచ్చిన దరఖాస్తులను అక్కడే విచారణ జరుపుతున్నాం. నిజమని తేలితే ఆమోదిస్తున్నాం. ఆన్‌లైన్‌లో సరిచేయడానికి ప్రభుత్వం ఇంకా అవకాశం ఇవ్వలేదు. ఏడు రోజుల నోటీసు గడువు ముగిసిన అనంతరం సంబంధిత రైతులకు ప్రొసీడింగ్‌లు అందజేస్తాం.

–రమేశ్‌కుమార్, తహసీల్దార్, కొందుర్గు